నడిచేదెలా..?

- నత్తనడకన సాగుతున్న రోడ్డు పనులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

నర్సంపేట రూరల్ : రోడ్డు వేసేందుకు చర్యలు చేపట్టారు. పెద్ద నాయకులు వచ్చి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఇక రోడ్డు వేస్తే తమ ఇబ్బందులు తీరుతాయని ఆనందపడిన ఆ ప్రాంత ప్రజల ఆశలు అడియాశలయ్యాయి. ఐదు గ్రామాల ప్రజలు చుట్టూ తిరిగి చెన్నారావుపేట, గిర్నిబావి మీదుగా నర్సంపేటకు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. నాసిరకంగా పోసిన కంకర రోడ్డు నుంచి రాలేక వాహదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాలు అదుపు తప్పి కిందపడిన సందర్భాలు ఉన్నాయి. ఇంత జరిగినా అధికారులు పట్టించుకోవడంలేదు.

నర్సంపేట మండలంలోని మహేశ్వరం క్రాస్ రోడ్డు నుంచి చెన్నారావుపేట మండలంలోని కోనాపురం వరకు పీఎంజీఎస్‌వై -3 కింద డబుల్ రోడ్డు పనులు మంజూరయ్యారు. ఈ పనులకు రూ.6.59 కోట్ల నిధులు మంజూరు కాగా 07-11-2021 రోజున మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత, నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డితో కలిసి పనులు ప్రారంభించారు. దీనికి సంబంధించిన కాంట్రాక్టర్ పనులను నత్తనడక చేస్తుండడంతో నర్సంపేట మండలంలోని రాములునాయక్‌తండా, గురిజాల, గుంటూరుపల్లి, జీజీఆర్‌పల్లి, చిన్నగురిజాల, లింగాపురం గ్రామాలకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ గ్రామాల ప్రజలకు నిత్యం వివిధ అవసరాల నిమిత్తం నర్సంపేటకు వస్తూ పోతుంటారు. ఈరోడ్డు సరిగా లేకపోవడంతో చిన్న గురిజాల, లింగాపురం, జీజీఆర్‌పల్లి, గురిజాల, గుంటూరుపల్లి గ్రామ ప్రజలు నర్సంపేటకు రావాలంటే అక్కల్‌చెడ, చెన్నరావుపేట మీదుగా నర్సంపేటకు, లేదంటే గిర్నిబావి, లక్నెపల్లి మీదుగా నర్సంపేటకు రావాల్సి వస్తోంది. దీంతో అదనంగా 20 కిలోమీటర్ల వరకు చుట్టూ తిరిగి రావాల్సి వస్తోంది. ఈప్రాంతంలో ప్రజలు ఎక్కువగా వ్యవసాయ పంటలు, కూరగాయాలు, అధికంగా పండిస్తుంటారు. సరుకులు, పాలు తదితర వాటిని తీసుకొని నర్సంపేటకు రావాలంటే ప్రజలు ఎంతో ఇబ్బంది ఉంటుందని వాపోతున్నారు. నూతన రోడ్డు వేసేందుకు కాంట్రాక్టర్ తారు తీసి వేస్తున్నారే తప్పా, దానిపై మళ్లీ నూతనంగా కంకర పోయకుండా నిర్లక్ష్యంగా వదిలివేయడంతో గుంతలుగా మారి రోడ్డు గుండా వాహనాలు వెళ్లే పరిస్థితి లేకుండాపోయింది. పనులను ప్రారంభమై 14నెలలు గడిచినప్పటికీ పనులు నత్తనడక నడవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి పనుల్లో వేగం పెంచాలని ప్రజలు కోరుతున్నారు.





నత్తనడకన పనులతో అధ్వానంగా మారిన రోడ్డు

ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం..



మహేశ్వరం క్రాస్ రోడ్డు నుంచి కోనాపురం మధ్య రోడ్డు పనులు నత్తనడకన సాగుతుండడంతో ఇబ్బందిగా ఉంటుంది. అటుగా వెళ్లే వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పనులను వేగంగా పూర్తి చేయాలి.

– దక్క శ్రీనివాస్, గురిజాల

చుట్టూ తిరిగి వెళ్తున్నాం..



రాత్రి వేళ ఆరోడ్డు గుండా వెళ్తే ప్రమాదాలకు గురికావాల్సి వస్తోంది. తెల్లవారుజామునే నర్సంపేట కూరగాయాల మార్కెట్‌కు వెళ్లాల్సి వస్తోంది. గురిజాల, మహేశ్వరం మీదుగా వెళ్తే 8 కిలోమీటర్లు వస్తుంది. సుమారు 18 కిలోమీటర్లు వరకు చుట్టూ తిరిగి వెళ్లాలి వస్తోంది.

– నర్సింహారావు, పాలవ్యాపారి

త్వరగా పూర్తి చేయించాలి



మహేశ్వరం క్రాస్ రోడ్డు నుంచి కోనాపురం రోడ్డు పనులను నత్తనడక సాగుతున్నాయి. త్వరగా కాంట్రాక్టర్‌తో పనులు చేయిస్తే ప్రజల కష్టాలు తీరుతాయి. ఈ రోడ్డు పనులను నాణ్యతతో చేయించాలి

– కర్నాటి పార్వతమ్మ, గుంటూరుపల్లి సర్పంచ్

క్లుప్తంగా

సమస్య పరిష్కరిస్తాం



నర్సంపేట రూరల్ : రైతుల పంటలకు నిరంతరం 12గంటల త్రిఫేస్ విద్యుత్‌ను అందిస్తామని విద్యుత్ శాఖ డీఈ సదానందం తెలిపారు. నర్సంపేట మండలంలోని నర్సింగాపురంలో విద్యుత్ నిరంతరం త్రిఫేస్ అందించాలని, ఓవోల్టేజీని నివారించాలని కోరుతూ రైతులు నిరసన వ్యక్తం చేశారు. దీంతో స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించి, రైతులు పంటలకు నీరందించేందుకు నిరంతరం 12 గంటల త్రిఫేస్ కరెంట్‌ను అందిస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఏడీఈ అమృనాయక్, ఏఈ సంపత్, లైన్ మెన్ కిషోర్, హెల్పర్ నగేష్, నర్సింగాపురం రైతులు ఈర్ల పైడి, భూసాని నర్సింహస్వామి, శంకర్, చందర్‌రావు, కుసుం బకోటి, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

ఖానాపురం: మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, మాజీ వైస్ ఎంపీపీ జాటోతు బాలునాయక్ తండ్రి సీనానాయక్ అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబాన్ని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం పరామర్శించారు. మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెంకటనర్సయ్య, రైతుబంధు కన్వీనర్ వెంకట్‌రెడ్డి, సర్పంచ్ బూస రమఅశోక్‌యాదవ్, సొసైటీ వైస్ చైర్మన్ వేణుకృష్ణ, ఎంపీటీసీలు, ఇతర ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, సొసైటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

పొదుపు జీవితానికి మలుపు

దుగ్గొండి: ప్రతి నెలా బ్యాంక్‌లలో పొదుపు చేసుకుంటే జీవితానికి మలుపు అవుతుందని ఏపీజీవీబీ గిర్నిబావి బ్రాంచ్ మేనేజర్ వేణుధనుంజయ అన్నారు. మండలంలోని చలపర్తి గ్రామంలో శుక్రవారం ఆర్థిక అక్షరాస్యత సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బ్యాంకులలో తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తే వడ్డీ రాయితీ వస్తుందన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల మహిళలు తమ రుణాలు క్రమం తప్పకుండా చెల్లిస్తే లక్షల్లో రుణాలు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, ప్రేమ్‌కుమార్, సీసీ పద్మ, వీఏఓ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు



పర్వతగిరి: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని ఏఐసీసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, పరకాల ఇన్‌చార్జి ఇనగాల వెంకట్రామిరెడ్డి, వరంగల్ కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. వారివెంట పీసీసీ సభ్యుడు అశోక్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, జున్ను రవి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



గీసుకొండ: మండలంలోని కొమ్మాల గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు శుక్రవారం పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. హనుమకొండలోని తన నివాసంలో ఎమ్మెల్యే వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను చూసి పలువురు తమ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పోలీసు ధర్మారావు, నాయకులు వీరాటి రవీందర్‌రెడ్డి, లెనిన్‌గౌడ్, ఎలుకుర్తి సర్పంచ్ పూండ్రు జయపాల్‌రెడ్డి, అంకతి నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

వార్డు సభ్యురాలి మృతి



సుగుణ(ఫైల్)

నల్లబెల్లి: మండలంలోని శనిగరం గ్రామానికి చెందిన 5వ వార్డు సభ్యురాలు పొన్నం సుగుణ(75) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ కక్కెర్ల శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు ఊడుగుల ప్రవీణ్ గౌడ్‌లు మృతురాలి కుమారుడు రవి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో సర్పంచ్ ద్యాగల మల్లికాంబ, ఆర్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఊటుకూరి చక్రపాణి, బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు ఊటుకూరి అశోక్ ఉన్నారు.

మొక్కజొన్న చేలకు 'కత్తెర' పురుగు



మొక్కచేనులో పరిశీలిస్తున్న రాంనర్సయ్య

వర్ధన్నపేట: మొక్కజొన్న చేలకు కత్తెర పురుగు ఆశించి పంట నష్టం చేస్తుందని, నివారణకు రైతులు వెంటనే చర్యలు చేపట్టాలని వర్ధన్నపేట మండల వ్యవసాయాధికారి రాంనర్సయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని చెన్నారంలో మొక్కజొన్న చేలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో 500 ఎకరాలు మొక్కజొన్న పంట రైతులు సాగు చేశారని, పంట క్షేత్రాలను పరిశీలించగా కత్తెర పురుగు ఆశించి పంట నష్టం జరుగుతుందని పురుగు పూర్తిగా నాశనం చేయకముందే నివారణ చర్యలు చేపట్టి పంట క్షేత్రాలను కాపాడుకోవాలన్నారు. దీని నివారణకు కార్బోఫ్యురాన్ గుళికలు వేయాలన్నారు. లేదా కొరాజెన్ 2 మిలీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. సున్నం, ఇసుక మొగిలో వేయవచ్చన్నారు. మొక్క లేత దశలో 5 శాతం వేపనూనె, క్లోరిఫైరిఫాస్ 50 ఈసీ 2 మిలీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు కో ఆర్డినేటర్ రంగారావు, రైతులు కత్తి సుధాకర్ పాల్గొన్నారు.

పథకాలతో పేద ప్రజలకు ఆసరా



చెక్కులు అందజేస్తున్న అరూరి రమేష్

వర్ధన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు ఎంతో ఆసరాగా నిలుస్తున్నాయని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. శుక్రవారం వర్ధన్నపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు రూ.4.04 లక్షలు, ముగ్గురికి సీఎం సహాయ నిధి చెక్కులను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ అరుణ, వైస్ చైర్మన్ ఎలేందర్‌రెడ్డి, పీఎసీఎస్ చైర్మన్ రాజేష్‌ఖన్నా, మాజీ జెడ్పీటీసీ సారంగపాణి, మండల పార్టీ అధ్యక్షుడు కుమారస్వామి, కౌన్సిలర్లు రాజమణి, రామకృష్ణ, అజీమ్, అన్వర్ పాల్గొన్నారు.

ప్రతి ఓటరును కలవాలి

100 ఓటర్ల బాధ్యతలు తీసుకున్న ప్రతి కార్యకర్త ఓటరును కలిసి ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలను వివరించాలని ఎమ్మెల్యే రమేష్ అన్నారు. శుక్రవారం వర్ధన్నపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వర్ధన్నపేట మున్సిపల్ చైర్ పర్సన్ ఆంగోతు అరుణ, కౌన్సిలర్లు, 100 ఓటర్ల ఇన్‌చార్జ్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అరూరి రమేష్ మాట్లాడుతూ 100 ఓటర్ల ఇన్‌చార్జ్ ప్రతి ఒక్కరు ఓటర్లకు అందుబాటులో ఉంటూ వారి కష్ట సుఖాల్లో పాలుపంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఎలేందర్‌రెడ్డి, నాయకులు పూజారి రఘు, అజీమ్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' దేశంలోనే వినూత్నం

- పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

గీసుకొండ: సీఎం కేసీఆర్ దూరదృష్టితో కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టారని, ప్రపంచంలోనే చేపడుతున్న ఈ సామూహిక కార్యక్రమం దేశంలో మరెక్కడా లేదని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కొనాయమాకుల వద్దగల రైతు వేదికలో కంటివెలుగు రెండో విడత కార్యక్రమం సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగించారు. రెండో విడతకు ప్రభుత్వం రూ.250 కోట్లు ఖర్చు చేస్తోందని, అధికారులు, ప్రజాప్రతినిధులు, వైద్య ఆరోగ్య శాఖ, ఆశ, అంగన్‌వాడీ టీచర్లు కార్యక్రమం విజయవంతానికి కృషి చేయాలన్నారు. మొదటి విడత కంటి వెలుగులో వచ్చిన సమస్యలను దృష్టిలో పెట్టుకుని గ్రామ గ్రామాన కంటి పరీక్షల శిబిరాలను నిర్వహించేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. ఎంపీపీ బీమగాని సౌజన్య, జెడ్పీటీసీ పోలీసు ధర్మారావు, మండల వైద్యాధికారి మాధవీలత, ఎంపీడీఓ గడ్డం రమేష్, కంటి వెలుగు జిల్లా ప్రత్యేక అధికారి డాక్టర్ పద్మశ్రీ, సీహెచ్ఓ మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ డోలె రాధాబాయి పాల్గొన్నారు.

వినియోగించుకోవాలి

ఖానాపురం: కంటి వెలుగును ప్రజలు వినియోగించుకోవాలని సర్పంచ్ చిరంజీవి అన్నారు. ఈ మేరకు కంటి వెలుగును విజయవంతం చేయాలని ముద్రించిన కరపత్రాలను మండల కేంద్రంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఈనెల 18నుంచి ఫిబ్రవరి 7వరకు కంటి వెలుగు వైద్య శిబిరాలను గ్రామంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకుని అవసరం ఉన్నవారు ఉచితంగా కంటి అద్దాలు, మందులను తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మేడిద కుమార్, కో ఆప్షన్ సభ్యుడు కొలిశెట్టి పూర్ణచందర్‌రావు, పోశెట్టి, ఏఎన్ఎం సునీత, పంచాయతీ కార్యదర్శి సుప్రజ, వార్డు సభ్యులు నాగరాజు, దమయంతి, సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి వేడుకలు



నెక్కొండ: నూతన వస్త్రాలను అందజేస్తున్న ధర్మేంద్ర



నర్సంపేట: బహుమతులు అందజేస్తున్న వాణి



దుగ్గొండి: నాచినపల్లిలో..

నెక్కొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ముందస్తుగా సంక్రాంతి వేడులు నిర్వహించారు. ఈ వేడుకల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ధర్మేంద్ర పాల్గొని, మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు వారికి ఇష్టమైన రంగంలో రాణించి సమాజ సేవకు అంకితం కావాలన్నారు. ముగ్గుల పోటీల్లో విద్యార్థులు పాల్గొని ప్రతిభచాటరన్నారు. సంస్కృతి, సాంప్రదాలను ప్రతిబిందించేలా ప్రజలందరూ పండుగలను జరుపుకోవాలని ఆయన సూచించారు. అనంతరం హైదరాబాద్‌కు చెందిన జి.మధు అందించిన నూతన వస్త్రాలు, గాలి పటాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కరుణశ్రీ, అధ్యాపకుల రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, జిల్లా అధ్యక్షుడు రమణాకర్, జాతీయ సేవ పథకం ప్రోగ్రాం అధికారి బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాంటిస్సోరి పాఠశాలలో ముగ్గుల పోటీ

నర్సంపేట: పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాలలో చైర్మన్ ఎర్ర జగన్‌మోహన్‌రెడ్డిఊర్మిళ ఆధ్వర్యంలో శుక్రవారం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ మేరకు విద్యార్థినిలు పలు రకాల రంగులతో ముగ్గులు వేశారు. మున్సిపల్ కౌన్సిలర్ పెండెం లక్ష్మీరామానంద్, బ్రహ్మకుమారి వాణిలు విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలు నాడెం సాంబయ్య, కుసుమ కల్యాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాచినపల్లిలో..

దుగ్గొండి: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని నాచినపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో పలువురు బాలికలు, యువతులు ముగ్గులు వేశారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెండ్యాల మమతరాజు, ఉప సర్పంచ్ జంగ రాజిరెడ్డి, ఎంపీటీసీ మమతామోహన్, పంచాయతీ కార్యదర్శి ఆనంద్ పాల్గొన్నారు.

రాజశ్రీ కోళ్ల పెంపకంతో బహుళ ప్రయోజనాలు



రాజశ్రీ కోళ్లను పంపిణీ చేస్తున్న రాజన్న

రాయపర్తి: రాజశ్రీ కోళ్ల పెంపకం ద్వారా బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న అన్నారు. పీ.వీ. నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ గ్రామంలో ఎస్సీ లబ్ధిదారులకు పెరటి కోళ్ల పెంపకానికి అనువైన రాజశ్రీ కోళ్లను ఉచితంగా పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కో కోడి 72 వారాల్లో 150కి పైగా గుడ్లు పెడుతుందని, ఈ కోళ్ల పెంపకంతో మెరుగైన ఆదాయం పొందవచ్చాన్నారు. కార్యక్రమంలో కేవీపీ శాస్త్రవేత్తలు డాక్టర్ శశాంక్, సాయికిరణ్, పెరకవీడు పశువైద్యాధికారి సోమశేఖర్, ఎంపీటీసీ రజిత, ఉపసర్పంచ్ లక్క సురేష్, ఎండీ బ్రహ్మం, పవన్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం



క్రీడలు ప్రారంభిస్తున్న చింతకింది శివకృష్ణ

చెన్నారావుపేట: మండలంలోని ఉప్పరపల్లిలో గ్రామ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి క్రీడా పోటీలను మాజీ సైనికుడు చింతకింది శివకృష్ణ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత క్రీడల్లో రాణించాలన్నారు. స్నేహభావంతో క్రీడలు ఆడాలని, నూతన పరిచయాలు, స్నేహాలను పెంచడంలో క్రీడలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం జిల్లా కార్యదర్శి పరికి మధుకర్, హైస్కూల్ చైర్మన్ కాసాని రవి, రైతు సమన్వయ కమిటీ సభ్యులు మస్తుర్తి అన్వేష్, పులి రాజ్‌కుమార్, ఏనుగుతల నరేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధానంతోనే చెల్లింపులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కిషన్

రాయపర్తి: ఈజీఎస్ పథకంలో అక్రమాలకు తావు లేకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని, ఇందులో భాగంగానే ఆధార్ అనుసంధానం చేపడుతుందని ఎంపీడీఓ కిషన్ అన్నారు. శుక్రవారం మండలంలోని పానీస్‌తండా గ్రామ పంచాయతీలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్ హాజరు నమోదు, ఆధార్ సీడింగ్ అయినవారికే డబ్బులు ఇచ్చేలా మార్పులు చేసినట్లు చెప్పారు. కూలీలు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో సర్పంచ్ బద్రునాయక్, ఏపీఓ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువజన దినోత్సవం



పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

సంగెం: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో సంగెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా యువజన దినోత్సవాన్ని నిర్వహించారు. శుక్రవారం కళాశాల విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ యువ కేంద్రం మండల కోఆర్డినేటర్ గాలి భిక్షపతి వివేకాందుడి సందేశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.శ్రీధర్, అధ్యాపకులు భిక్షపతి, రమ, మధు, రేఖ, భవాని, సాగర్, వలంటీర్ సురేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

మల్లన్న జాతరకు రండి



మంత్రి దయాకర్‌రావును ఆహ్వానిస్తున్న చైర్మన్

పర్వతగిరి: మండలంలోని గోపనపల్లి శ్రీదూడల మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలు ఈనెల 15, 16తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఆర్‌డీఎఫ్ విద్యా సంస్థల వ్యవస్థాపకుడు ఎర్రబెల్లి రామ్మోహన్ రావును శుక్రవారం ఆలయ చైర్మన్ బెల్లం బాలరాజు సర్పంచ్ పంజా మహేష్‌లు జాతరకు రావాలని ఆహ్వానించారు. వారింఎట ఎంపీటీసీ సూర రమేష్, ఉపసర్పంచ్ సూర అశోక్, గుండా రాజేంద్రప్రసాద్, అల్లాడి నర్సయ్య, బెల్లం వీరస్వామి, కారింగుల నర్సయ్య, పవన్‌కల్యాణ్ ఉన్నారు.

పాస్టర్ ఆత్మహత్య

నెక్కొండ: అనారోగ్యంతో మనస్తాపానికి గురైన ఓ ఫాస్టర్ మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు చెందిన గుల్లి త్రిమోతీ (43) రెండేళ్ల క్రితం నెక్కొండ సీఎస్ఐ చర్చి ఫాస్టర్‌గా వచ్చారు. అనారోగ్యం సమస్యలు తీవ్ర కావడంతో మనస్తాపానికి గురయ్యారు. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులసమాచారంతో ఎస్సై సీమాఫర్హీన్ సిబ్బందితో వచ్చి శవ పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం నర్సంపేట ఏరియా ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించామన్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఆమె పేర్కొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీ బాధ్యులు

నర్సంపేట రూరల్ : మండలంలోని గురిజాల గ్రామ మున్నూరుకాపు సంఘం నూతన కమిటీని 6వ మహాసభ సమావేశంలో శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. అధ్యక్షుడిగా మెట్టు రమేష్, ఉపాధ్యక్షుడిగా బండారి రాజేందర్, ప్రధాన కార్యదర్శి నామాల రమేష్, కార్యదర్శి తోట శంకర్, డైరెక్టర్లుగా గడ్డం శ్రీను, నీలం వెంకటేశ్వర్లు, బర్ల కుమారస్వామి, గోలి రవీందర్, కొత్త సాయి, మెట్టు గణేష్, నామాల వెంకన్న, బండారి రాజు, సలహా కమిటీ నాయకులు బండారి చందర్‌రావు, గజ్జి రాజు, నామాల మోహన్, కందుల రమేష్, గడ్డం వెంకటేశ్వర్లు, ఎడ్ల రాకేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

అందాల పోటీలను విజయవంతం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, రైతులు

ఖానాపురం: నర్సంపేట పట్టణంలోని బాలుర హైస్కూల్‌లో శనివారం నిర్వహించే పాడి పశువుల అందాల పోటీలను విజయవంతం చేయాలని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, శాంతిసేన రైతు సంఘం గౌరవ అధ్యక్షుడు ఎర్ర జగన్‌మోహన్‌రెడ్డిలు పిలుపునిచ్చారు. ఈ మేరకు అందాల పోటీలను విజయవంతం చేయాలని కరపత్రాలను శుక్రవారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాడి పశువులతో పోటీల్లో పాల్గొనే రైతులకు ప్రయాణ చార్జీల కింద రూ.600 అందజేయనున్నట్లు తెలిపారు. పోటీల్లో జోడెద్లు, ఆవులు, గేదెలు, గొర్రె, మేకపోతులు, దూడలు, కోడి పుంజులు, పెంపుడు కుక్కలను అందంగా అలంకరించుకుని రావాలన్నారు. ఉదయం 10గంటలకు పోటీలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. పోటీలో పాల్గొనే రైతులకు ఉచిత భోజన వసతి కూడా కల్పించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మేడిద కుమార్, విజయ పాలడైరీ చైర్మన్ పరుచూరి నరేంద్ర, వెంకటనారాయణ, కుమారస్వామి, వెంకటేశ్వర్లు, పూర్ణచందర్‌రావు, ప్రసాద్, మాధవరావు, సాంబశివరావు, యూసుఫ్, తదితరులు పాల్గొన్నారు.

బూత్, వార్డు కమిటీలు ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామానంద్

నర్సంపేట: నర్సంపేట పట్టణంలో కాంగ్రెస్ పార్టీ బూత్, వార్డు కమిటీలను ఏర్పాటు చేయాలని టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నర్సంపేట పట్టణంలో బూత్‌వార్డు కమిటీలను ఈనెల 16వ తేదీ నుంచి రోజుకు ఐదు వార్డుల చొప్పున 24వార్డుల్లో బూత్, వార్డు కమిటీలను ఏర్పాటు చేయాలని వార్డు ఇన్‌చార్జిలు, ముఖ్య కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ వైస్ ఎంపీపీ చింతల సాంబరెడ్డి, నర్సంపేట కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు ఓర్సు తిరుపతి, కౌన్సిలర్లు ఎలకంటి విజయ్‌కుమార్, వినోదసాంబయ్య, మాజీ ఎంపీటీసీ ప్రభాకర్, సాంబయ్య, రవి, రమేష్, కుమారస్వామి, సందీప్, వెంకన్న, వెంకన్న పాల్గొన్నారు.